357)ముఖారి

ప॥ సర్వేశ్వరా నీతో సరి యెవ్వరు। పూర్వపువారు చెప్పగా బూచి కొలిచేగాని॥

చ॥ చేరి వేదములు నిన్ను జెప్పగా వినుటేకాని। నీరూపము దర్శించేవార లెవ్వరు।
ధారుణిలో నీ యవతారాలే చూచుట। ధీరత నీమహిమలు తెలిసే వారెవ్వరు॥

చ॥ భూమివారి జూచి నిన్ను బూజలు సేయుటగాని। కామించి నీతో మాటాడేఘను లెవ్వరు।
దీమసాన నీదాసుల ద్రిష్ట మెరుగుటగాని। యీమేర నీదైవిక మెరిగే వారెవ్వరు॥

చ॥ వరములు నీవియ్యగా వచ్చి సేవించుటగాని। కెరలి నీమూర్తి వెదకే వారెవ్వరు।
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌటగాని। అరసి నిన్ను సుద్దులడిగే వారెవ్వరు॥